ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

దొంగతనాలు, ప్రమాదాలపై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఐ జి.శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని బొర్రం పాలెంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లే సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు తెలపాలని సూచించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల్లో ప్రజలు రోడ్డు దాటి సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివనాగు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిఐ

కౌలు రైతుపై క'రుణ' ఏదీ..?

- రుణాల మంజూరులో ప్రభుత్వ నిర్లక్ష్యం
- అప్పుల పాలవుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

'అర్హులైన కౌలు రైతులందరికీ రుణాలు అందించాలి. వడ్డీ వ్యాపారుల చేతిలో వారు చిక్కుకుపోకుండా చర్యలు తీసుకుంటాం' అంటూ పాలకులు పదే పదే హామీలు ఇస్తున్నారు. కానీ ఆ హామీలు అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు.. వైసిపి పాలనలో కౌలు రైతులు రుణాల కోసం పడరాని పాట్లు పడ్డారని, బ్యాంకు నుంచి రుణాలందక, కష్టకాలంలో సాయమందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని కూటమి నాయకులు చెప్పుకొస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు కావస్తున్నా గత సర్కారు బాటలో తమ పయనం అన్నట్లుగా ఉంది.

జిల్లాలో ఈ ఏడాది 2.19 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో 2.12 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. 1.50 లక్షల మంది రైతులు ఉండగా వీరిలో లక్ష మందికి పైగా కౌలు రైతులే వాస్తవ సాగుదారులుగా ఉన్నారు. అయితే వ్యవసాయ శాఖ అధికారులు ఈ ఏడాది 68,890 మందికి మాత్రమే

కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకుని 59,967 మందికి జారీ చేశారు. జిల్లాలో ప్రధానంగా వరి, చెరకు, పొగాకు, మొక్కజొన్న, అరటి, పామాయిల్ తదితర పంటలు పండిస్తారు. ఇందులో 80 శాతానికి పైగా కౌలు రైతులే ఉన్నారు. ఏటా పంట కోత, నూర్పిడికి వచ్చే నవంబరు, డిసెంబరు నెలల్లో తుపాన్లు, వాయుగుండాల ప్రభావంతో రూ. లక్షల్లో నష్టపోతున్నా ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదు.

అరకొరగానే....

వాస్తవానికి ఖరీఫ్ సాగు మొదలైన వెంటనే రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పుడు రబీ పంట సాగులో ఉంది.దాదాపుగా అన్ని ప్రాంతాల్లో నాట్లు ప్రక్రియను పూర్తి చేశారు. అయితే బ్యాంకర్లు మాత్రం రుణాలు పూర్తిస్థాయిలో నేటికీ ఇవ్వని పరిస్థితి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అరకొర ఋణాలే ఇచ్చారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.35 నుంచి రూ.38 వేల వరకూ రుణాలు ఇవ్వాలని జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో నిర్ణయించారు. ఈ ఏడాది రూ.275 కోట్లు రుణాల ఇచ్చేందుకు లక్ష్యంగా తీసుకున్నారు. కానీ ఇప్పటి వరకు కేవలం 15,020 మందికి రూ.63.30 కోట్లు మాత్రమే ఋణంగా ఇచ్చారు. ఇలా కౌలు రైతుల సంఖ్యకు, ఇస్తున్న గుర్తింపు కార్డులకు, వారిలో రుణం ఇచ్చే సంఖ్యకు ఎటువంటి సంబంధం ఉండడం లేదు. పాలకులు మాత్రం కౌలు రైతులపై అమితమైన ప్రేమ చూపిస్తున్నట్లుగా, ఎన్నో ప్రయోజనాలు కల్పిస్తున్నట్లుగా ప్రకటనలు ఇస్తున్నప్పటికీ వాస్తవ రూపంలో మాత్రం రుణాలు సక్రమంగా ఇవ్వని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఏటా ఈ రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. భూ యజమాని అంగీకారం లేనిదే సాగుదారు హక్కు పత్రాలు (సిసిఆర్‌సి) లభించడం లేదు. ఈ కార్డులు లేక, ప్రభుత్వ ప్రయోజనాలు పొందలేక కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారు. రుణాల కోసం ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

కౌలు రైతులందరికీ రుణాలు ఇవ్వాలి

కౌలు రైతులకు భూ యజమాని సంతకం నిబంధనను తొలగించి గుర్తింపు కార్డులు అందరికీ ఇవ్వాలి. కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు, పంట నష్టపరిహారాలు, పంటల బీమా ఇవ్వాలి. దేవాలయ భూములను కౌలు చేస్తున్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలి. భూమిలేని ప్రతి కౌలు రైతుకి రైతు భరోసా ఇవ్వాలి.

- వల్లు రాజబాబు,
ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి.

జాతీయస్థాయి చెస్ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నేటి నుంచి చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో నేటి నుంచి ఐదు రోజులపాటు 13వ జాతీయ స్థాయి స్కూల్స్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి గురువారం పరిశీలించారు. పోటీలు జరిగే ఇండోర్ స్టేడియం, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులకు కల్పించనున్న భోజనం, వసతి, మరుగుదొడ్లు, ప్రాక్టీస్ గదులు తదితర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 28 రాష్ట్రాల నుంచి 1,239 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. చెస్ ఆర్బిటర్స్, వాలంటీర్లు 200 మంది, ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థుల తల్లిదండ్రులు, సహాయకులు 800 మంది ఉంటారన్నారు. ఈ పోటీల సందర్భంగా క్రీడాకారులు, సిబ్బంది, సహాయకులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, రెవెన్యూ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, పోలీస్ అధికారులతో పాటు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, ఆర్‌డిఒ కె.శ్రీరమణి, జిల్లా క్రీడా సాధికార సంస్థ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌కుమార్, చెస్ ఛాంపియన్ షిప్ ఛైర్మన్, శ్రీ ప్రకాష్ ఎనర్జీ డైరెక్టర్ సిహెచ్.విజయ్‌ప్రకాష్, చెన్నై చీఫ్ ఆర్బిటర్ పాల్ ఆరోగ్యరాజ్, పెద్దాపురం చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెవివి.శర్మ, కార్యదర్శి సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం, పట్టణ పరిధిలో దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తుల పింఛన్ల పరిశీలనను నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీలలిత తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మండల పరిధిలోని పులిమేరు, దివిలి, ఆనూరు గ్రామాల్లో పక్షవాతం, దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులు 9 మంది పింఛన్లు తీసుకుంటున్నారన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని పిహెచ్‌సిల వైద్యాధికారులు, ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీల కార్యదర్శులు ఈ పరిశీలనలో పాల్గొంటారన్నారు. ఈ మేరకు పింఛన్ల లబ్ధిదారులకు సమాచారం అందజేశామన్నారు. పట్టణంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్త పింఛన్లు అందుకుంటున్న వారిని పరిశీలించనున్నట్లు కమిషనర్ పద్మావతి తెలిపారు.

ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాలి

ప్రజాశక్తి - తాళ్ళరేవు

రాష్ట్ర ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్‌ను ప్రకటించాలని సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర కన్నా నేడు మార్కెట్‌లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. కేరళ, తెలంగాణ, చతీస్‌ఘడ్ వంటి రాష్ట్రాలు బోనస్ ప్రకటించి అక్కడ రైతులను ఆదుకుంటున్నాయని గుర్తు చేశారు. ఎరువులు, పురుగు మందులు విత్తనాలు, డీజిల్ తదితర ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు నష్టాల పాలవుతున్నారని అన్నారు. మరోవైపు అకాల వర్షాలు, తుపానులు కౌలు రైతులను వెంటాడుతున్నాయని, ఫలితంగా పండించిన పంటకు రక్షణ లేకుండా పోయిందన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర ప్రకటించడంతోపాటు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పెసా చట్టంపై నేటి నుంచి శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

గిరిజన మండలాల అభివృద్ధికి సంబంధించి పంచాయితీ ఎక్స్టెన్షన్ ఇన్ షెడ్యూల్ ఏరియాస్ (పెసా) చట్టంపై శిక్షణా కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుందని శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని మండలాల అభివృద్ధికి గాను ఫిబ్రవరి నెలలో జరగనున్న మండల గ్రామస్థాయి అవగాహన సదస్సులో పెసా చట్టంపై జరిగే మాస్టర్ ట్రైనీలుగా మండలాల పరిధిలోని ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజులు చొప్పున శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈనెల 17, 18వ తేదీల్లో ఒక బ్యాచ్‌కు, రెండో బ్యాచ్‌కు ఈనెల 21, 22 తేదీల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. శిక్షణానంతరం ఫిబ్రవరి నెలలో ఆయా మండలాల్లో జరిగే పెసా అవగాహన కార్యక్రమాల్లో పంచాయతీ సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పిస్తారరన్నారు.

సంఘం కృషి అభినందనీయం

ప్రజాశక్తి - కాకినాడ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న లీడ్ బ్యాకు అధికారులు

కౌలు రైతుల హక్కుల కోసం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం చేస్తున్న కృషి అభినంద´నీయమని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సిహెచ్ ఎస్‌వి.ప్రసాద్, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ కాకి సాయి మనోహర్ అన్నారు. గురువారం కాకినాడ లీడ్ బ్యాంకు కార్యాలయంలో ఎపి కౌలు రైతు సంఘం 2015 క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రైతాంగ సమస్యల పట్ల చిత్తశుద్ధితో సంఘం పని చేస్తుందన్నారు. కౌలు రైతులకు రుణాల విషయంలో బ్యాంకులు ఎక్కడైనా ఇబ్బంది పెట్టిన తమ దృష్టికి తీసుకువస్తే కౌలు రైతు లకు పంట రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకుం టామన్నారు. అప్పు తీసుకున్న రైతులను మళ్లీ కట్టించే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు మాట్లాడుతూ జిల్లాలో కౌలు రైతుల సమస్యలు, పంట రుణాల, పంట గిట్టుబాటు ధరలు, పంట కాలువలు, నీటి ఎద్దడి సమస్యలు పరిష్కారం కోసం సంఘం కృషి చేస్తుందని తెలిపారు. నూతన సంవత్సరం క్యాలెండరు ద్వారా సంఘం కార యక్రమలకు సహకరించిన అందరికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా సంతోష్‌కుమార్, కుక్కిరిమెట్ల సత్తి రాజు, కనకాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15 నుంచి కాకినాడలో హాకీ టోర్నమెంట్

ప్రజాశక్తి - కాకినాడ

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌ను కాకినాడ కేంద్రంగా వచ్చే నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి తెలిపారు. కాకినాడ కేంద్రంగా ఆల్ ఇండియా స్థాయిలో హాకీ టోర్నమెంటు నిర్వహించడం శుభ పరిణామం అని అన్నారు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌ను కాకినాడలో నిర్వహించాలని కలెక్టర్ చేసిన ప్రతిపాదనకు సెంట్రల్ సివిల్ సర్వీసెస్ బోర్డ్ అంగీకరించింది. ఈ నేపథ్యంలోనే గురువారం కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్, ట్రస్ట్ ఫౌండర్, ఆదాయ పన్ను అధికారి రవిచంద్ర జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివీద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కాకినాడ వేదికగా జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ టోర్నమెంట్ రానున్న ఫిబ్రవరి నెల 15 నుంచి 28 వరకు కాకినాడ క్రీడా ప్రాధికార సంస్థ మైదానం ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ లో జరుగుతుందన్నారు. కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్, జిల్లా హాకీ అసోసియేషన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సక్రమంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఇటువంటి మెగా టోర్నమెంట్ కాకినాడ జిల్లా ప్రాతినిధ్యం వహించడం ద్వారా జిల్లాలోని క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో కాకినాడలో అంతర్జాతీయ టోర్నమెంట్లు నిర్వహించేందుకు అన్ని విధాల కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు

సిపిఐ ఆధ్వర్యాన ఫిబ్రవరి 1న సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

'మన గ్యాస్ మన రాష్ట్రానికే' దక్కాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 1న కాకినాడ కేంద్రంగా సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు తెలిపారు. గురువారం స్థానిక పిఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ సముద్ర తీరంలో చమురు సంస్థలు తీస్తున్న గ్యాస్ నిక్షేపాల్లో రాష్ట్ర వాటా కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఏకమై సాధించాల్సిన అవసరం ఉందన్నారు. గత ఏడాది జనవరి 7 నుంచి కాకినాడ సముద్రతీరంలో చమురు ఉత్పత్తి ప్రారంభం అయిందన్నారు. ఆంధ్ర తీరంలో ఉన్న చమురు నిక్షేపాలు దేశ ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్నే మార్చబోతున్నాయని అన్నారు. ప్రపంచంలో ఏప్రాంతంలో నైనా స్దానికంగా లభ్యమయ్యే సహజ వనరులను ఉపయోగించుకునే హక్కు ఆప్రాంతానికే ఉంటుందనేది సహజ న్యాయ సూత్రమన్నారు. సహజ వనరులు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికి ఉత్పత్తిలో 50 శాతం వాటాను కేటాయించాలని 12వ ఫైనాన్స్ కమిషన్ కూడా స్పష్టం చేసిందన్నారు. మన అవసరాలు తీర్చకుండానే 1500 కిలో మీటర్ల దూరంలో ఉన్న గుజరాత్, మహారాష్ట్రాలు మన తీరం నుంచి గ్యాస్‌ను తరలించుకుపోతున్నాయని విమర్శంచారు. ఆంధ్ర ప్రాంతానికి న్యాయమైన గ్యాస్ కేటాయింపుల కోసం, న్యాయమైన ధర కోసం, 50 శాతం లాభం వాటా కోసం వామపక్షాలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 1న నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న తాటిపాక మధు

వ్యవసాయ కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాళ్ళరేవు

వ్యవసాయ కార్మిక సంఘం -2025 క్యాలెండర్‌ను ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ఆవిష్కరించారు. గురువారం స్థానికంగా జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.ఈశ్వరరావు కెఎస్. శ్రీనివాస్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం పేదల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి నిరంతరం పోరాడుతుందన్నారు. ఇటువంటి సంఘాన్ని అందరూ ప్రోత్సహించాలని అన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

ముప్పుగా సెల్ఫీల మోజు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ -కాకినాడ బీచ్ రోడ్లో పర్యాటకులు సెల్ఫీల మోజులో సాహసాలకు దిగుతున్నారు. సంక్రాంతి పండుగ వేళ పాఠశాలలకు సెలవులు కావడంతో గురువారం బీచ్ రోడ్డు పర్యాటకులతో కిటకిటలాడింది. వాహనాలు రోడ్డుకి ఇరువైపులా నిలుపుదల చేయడంతో పలుచోట్ల ట్రాఫిక్ అంతరాయం కలిగింది. తిమ్మాపురం, కొత్తపల్లి పోలీసులు పహార కాశీ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే వాహనదారులకు కనీసం 3 గంటలైనా వెచ్చించాల్సివచ్చింది. ఇదిలావుంటే సెల్ఫీల మోజులో కొంతమంది పర్యాటకులు బీచ్ రోడ్డుకు కెరటాలు తాకిడికి అడ్డంగా వేసిన రక్షణ రాళ్ల ఎక్కి మరి సెల్ఫీలు తీసుకుంటున్నారు. సముద్రపు అలల తాకిడి ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఫోటోలు తీసుకునే సందర్భంలో కెరటాలు తాకిడికి పడిపోయి గాయాలపాలైన సందర్భాలు ఉన్నాయి. ప్రమాదాల నివారణకు అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని పరిశీలకులు కోరుతున్నారు.

సెల్ఫీల కోసం కెరటాల వద్దకు వెళ్తున్న జంట

మరిడమ్మను దర్శించుకున్న మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి కుటుంబ సమేతంగా గురువారం మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు, ఆసాధులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆమెకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పూజల్లో పాల్గొన్న కమిషనర్ పద్మావతి

కార్టూ'నిజం'



ఆర్‌టిసి భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

ఆర్‌టిసి భద్రతా మాసోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు గురువారం విడుదల చేశారు. జనవరి 17-21 వరకూ బస్సుల కండిషన్ మెరుగుపరుచుట, జనవరి 22 -23 ప్రమాద రహిత డ్రైవర్లకు సేఫ్టీ అలవెన్స్ ఇచ్చుట, జనవరి- 24 డ్రైవర్స్ డేగా నిర్వహిస్తామన్నారు. జనవరి 25-28 రోడ్డు భద్రతపై డ్రైవర్లకు శిక్షణ, జనవరి -29 నుంచి ఫిబ్రవరి -4 వరకు డ్రైవర్లకు వైద్య పరీక్షలు, ఫిబ్రవరి 5-6 ప్రమాదాలు చేసిన డ్రైవర్లకు కుటుంబం తోపాటు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పారు ఫిబ్రవరి 7 - 10 రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, ఫిబ్రవరి 11 - 12 రక్తదాన శిబిరాలు, ఫిబ్రవరి 13 -14 రోడ్ సేఫ్టీపై ఆడిట్, ఫిబ్రవరి -15 ముగింపు వేడుక, ఉత్తమ డ్రైవర్లకు బహుమతి ప్రధాన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొదటి ప్రారంభ కార్యక్రమం ఆర్‌టిసి డిపోలో నిర్వహించారు. డిపో మేనేజర్ ఎంయువి మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నివారణకు అవసరమైన నైపుణ్యాలను బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, పిఆర్ఒ సిహెచ్.వెంకటరాజు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్‌రెడ్డి

స్థానికులతో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

మండలంలో ముద్రగడ పర్యటన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మాజీ మంత్రి, వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభం మండలంలోని చిన్న శంకర్లపూడి, సిరిపురం గ్రామాల్లో ముద్రగడ పద్మనాభం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సిరిపురంలో అనపర్తి భాను స్వగృహంలో కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపిని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని అన్నారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ గిరిబాబుని ఆశీర్వదించాలన్నారు. ఏ కష్టం వచ్చినా ప్రజలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏపూరి రామారావు, గౌతు స్వామి, గణేశుల రాంబాబు, దళే చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారులకు పోటీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పి.మల్లవరంలో మహిళ, చిన్నారులకు గురువారం పోటీలు జరిగాయి. మహిళలకు రంగవల్లులు, చిన్నారులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగవల్లుల పోటీల్లో మొదటి మూడు బహుమతులను పి.రజని, వైవివి.లక్ష్మీ, జి.విమల దక్కించుకున్నారు. మ్యూజికల్ ఛైర్స్ పోటీల్లో పి.వసుధ, జె.హర్షిత, సిహెచ్.బాలధనశ్రీ మొదటి మూడు బహుమతులను వరుసగా గెలుపొందారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి బాబీ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు ముత్యాల జయలక్ష్మి విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో విల్ల సత్యనారాయణ, ధూళిపూడి సుభ, దున్న సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

పైడిపాలలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాలలో ఇఎస్ఎన్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు గురువారం నిర్వహించారు. ముగ్గుల పోటీలలో విజేతలు పళ్లెం భవాని, పళ్లెం కావ్య, మంచిల సుశీల, లింగేటి భూదేవి, బొంతు సుమతికి మాజీ సర్పంచ్ గొళ్ళు లక్ష్మణమూర్తి, స్థానిక నాయకులు ఈగల సత్తిబాబు, గంగ సూరిబాబు, పి.వరహాలు బహుమతులను అందజేశారు.

నేరాలు ఘోరాలు

పంట కాలువలో వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ముచ్చుమిల్లి వంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు గురువారం తెలిపారు. వివరాలు ఇవి.. గుర్తించిన మృతదేహం వ్యక్తి వయసు సుమారు 35 నుంచి40 సంవత్సరముల మధ్య ఉండవచ్చని, వ్యక్తి నీలం రంగు షర్టు, నలుపు రంగు ఫాంట్ ధరించి ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. అతని ఎత్తు సుమారు 5 అడుగులు ఉన్నాడని అన్నారు. ముచ్చుమిల్లి గ్రామం, మధ్య కొంపల గ్రామం నడుమ గల కాలువలో అతని మృత దేహం లభ్యమైందన్నారు. మృతుని వివరాలు ఎవరికైనా వివరాలువుతెలిస్తే రామచంద్రపురం పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలపై దాడి 45 మందిపై కేసు

ప్రజాశక్తి - గోపాలపురం

కోడిపందేలపై దాడులు నిర్వహించి 45 మందిపై కేసులు నమోదు చేసినట్టు కె.సతీష్ కుమార్ తెలిపారు. ఈ నెల 13, 14, 15 తేదీలలోకోడిపందేలు, గుండాట, జూదం ఆడుతున్న వారి మీద రైడ్స్ చేసి మూడు రోజులలో ఈ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. 13 కోళ్లు, 16 కోడి కత్తులు, మూడు గుండాట బోర్డులు, రూ.33,190 క్యాష్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు.

కానిస్టేబుల్‌ను గాయపరిచిన వ్యక్తికి జైలు శిక్ష

ప్రజాశక్తి - కడియం

విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌ను ఆటంకపరిచి, తీవ్రంగా గాయపరిచిన వ్యక్తికి కోర్టు ఏడాది జైలు శిక్ష విధించినట్టు కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. 2022లో కడియం మండలం వీరవరంలో కనకదుర్గమ్మ తల్లి జాతరలో డ్యూటీలో భాగంగా బందోబస్తు నిర్వహిస్తున్న రాజమహేంద్రవరం 2 టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.బుజ్జిబాబును పొట్టిలంక గ్రామానికి చెందిన డేగల వరప్రసాద్ తీవ్రంగా గాయపరిచాడు. అప్పటి సిఐ పివిజి.తిలక్ కేసు దర్యాప్తు చేశారు. నిందితునిపై నేరం రుజువు కావడంతో రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బాషా ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధించారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెరవలి

పురుగు మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. మండలంలోని ఖండవల్లి పంచాయతీ పరిధిలో లంకమాలపల్లికి చెందిన పల్లేటి రవి (25) వ్యవసాయ కూలీ. 2021లో అదే గ్రామానికి చెందిన అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె. భార్యా భర్తల మనస్పర్థల కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. 15వ తేదీ రాత్రి పురుగు మందు తాగడంతో తణుకు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రవి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరావు తెలిపారు

14 మందిపై కేసుల నమోదు

ప్రజాశక్తి - పెద్దాపురం

పోలీస్ స్టేషన్ పరిధిలో సంక్రాంతి సందర్భంగా వివిధ గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో కోడి పందేలు, గుండాట నిర్వహిస్తున్న 14 మందిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. కోడిపందాలు, గుండాట, ఇతర జూదాలు నిర్వహించరాదని అవగాహన కల్పించామని, అయినా పలువురు కొన్ని చోట్ల జూదాలను నిర్వహించడంతో వారిని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

పర్యాటక కేంద్రంగా ధనమ్మ మర్రి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కేదార్‌లంక పంచాయతీ శివారు వీధి వారి లంక గ్రామంలో పర్యాటక కేంద్రంగా ధనమ్మ మర్రి పేరొందింది. ఇక్కడ ధనమ్మ తల్లి అమ్మ వారిని దర్శించుకునేందుకు యాత్రికులు గురువారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. పర్యాటక కేంద్రంగా పేరు పొందిన వీధి వారి లంకలో ఉన్న ఈ ధనమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు అమలాపురం, అంబాజీపేట, రాజోలు, కొత్తపేట, రావులపాలెం, కపిలేశ్వరపురం, మండపేట, రామచంద్రాపురం, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు ఉదయం నుంచి సాయంకాలం వరకు ఆటపాటలతో సందడి చేశారు. పరిసర ప్రాంతాల నుంచి యాత్రికులు కుటుంబ సమేతంగా ఇక్కడకు వచ్చి ధనమ్మ మర్రి సన్నిధి లోనే వంటా వార్పు చేసుకొని సాయంత్రం వరకు మర్రి వూడల వద్ద గడిపారు. ప్రతి ఆదివారం మర్రి చెట్టు వద్ద యాత్రికులతో సందడి నెలకొంటుంది.

మసీదు అభివృద్ధికి నిధుల మంజూరు

ప్రజాశక్తి - అమలాపురం

ఏపి స్టేట్ వక్ఫ్ బోర్డ్ సభ్యునిగా గా హాజీ ముఖ్రం హుస్సేన్ ఇటీవల ప్రమాణం స్వీకారం చేశారు. ఆయన ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా స్థానిక మొల్ల ముస్తఫా మసీదుకు సంబంధించి అభివద్ధి నిధులు రూ.8.64 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన చెక్కును అమలాపురం ఎంపి గంటి హరీష్ బాలయోగి, అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా మసీదు కమిటీ గురువారం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, వక్ఫ్ బోర్డు మెంబర్ హాజీ ముఖ్రం హుస్సేన్‌కు మసీద్ కమిటీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడి సోంబాబు, మెట్ల రమణ బాబు, మామిడికుదురు గ్రామ సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎఆర్‌హెచ్ఎసంఘ అధ్యక్షులు ఆబేదలి, టిడిపి మైనారిటీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి ఎండి.బషీర్, రాజా తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుని మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు గ్రామంలో మాధవరాయుని పేటకు చెందిన శతాధిక వృద్ధుడు ఇరుసుమండ ఆనందరావు (105) గురువారం మృతి చెందారు. ఆయనకు ఎవరూ లేకపోవడంతో స్థానిక ఎఎన్ఎం పి.రోజా, ప్రసాద్ దంపతులు ఆదరించారు. మంచి వ్యక్తిగా పేరు పొందిన ఆయన మృతికి పలువురు నివాళులర్పించారు

యానాం వార్తలు

కార్మికుని అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు లార్డ్ వెంకీ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న మెట్టకూరు గ్రామానికి చెందిన కార్మికుడు నందికొల్ల వీరభద్రరావు(80) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం..గురువారం ఉదయం యథావిధిగా డ్యూటీకి హాజరవ్వగా పనిచేస్తున్న సమయంలో స్పృహ కోల్పోయి పడిపోయారని వెంటనే తమకు సమాచారం అందించగా కంపెనీ వద్దకు వెళ్లి చూసేసరికి స్పృహలో లేడని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారన్నారు. పడి పోయిన వ్యక్తిని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యు లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మురుగానందం తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని పోలీస్ స్టేషన్ వద్ద ఎం.ప్రసాద్‌రాజు, చీకట్ల రామకృష్ణ, గోపి సురేష్, మేడిశెట్టి లోవరాజు, దుగ్గుదుర్తి అనిత డిమాండ్ చేశారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి

పని ప్రదేశంలో మృతి చెందిన కార్మికుడు వీరభద్రరావు కుటుంబానికి రూ.10 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.ఇ కనైనా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కార్మికులకు భద్రత ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

అభివాదం తెలియచేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - యానాం

స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1980-81 నాటి 10వ తరగతి బ్యాచ్ 45 ఏళ్ళ తర్వాత అదే పాఠశాలలో గురువారం జవహార్ బాలభవన్ సూపర్‌వైజర్ చింతా కొండలరావు ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఎక్కడెక్కడో స్థిరపడి సంక్రాంతి పండుగ సందర్భంగా యానాం వచ్చిన, స్థిరపడిన పూర్వ విద్యార్థులు సమావేశమై తాము చదువుకున్న సమయంలో జరిగిన అనేక మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుని 58 సంవత్సరాల పైబడిన వారు చిన్నపిల్లల్లా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అప్పటి పాఠశాల తీరుతెన్నులు, అదే పాఠశాల ఎన్నో అధునాతన సౌకర్యాలతో ప్రస్తుతం ఉన్న విద్యా సంస్థ గురించి, ఉపాధ్యాయుల గురించి నెమరువేసుకుంటూ గడిపారు. 45 ఏళ్ల తర్వాత పూర్వపు విద్యార్థులు కలుసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో చింతా కొండలరావు, మాజేటి నటరాజన్, సలాది దుర్గాశ్రీనివాస్, సుదర్శనం సత్యశ్రీనివాస్, గీదా సత్యనారాయణ, ముత్యాల బ్రహ్మానందరావు, నల్లా వెంకన్న, కట్టా సుబ్బరాజు, కొప్పిశెట్టి వెంకన్నబాబు, తటవర్తి మార్కేండేయులు, వర్ధినీడి సత్యనారాయణ, ఓలేటి పేర్రాజు, కామిశెట్టి భుజంగసాయి, కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడతున్న మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్

తాగునీటిలో మురుగునీరు

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేటలో గత 15 రోజుల నుంచి తాగునీటిలో డ్రెయినేజీలోని మురుగునీరు కలిసిపోతుందని మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కోన వివిహెచ్.సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన కనకాలపేటలోని తిరుమలనాయుడు కాలనీ, ధనలక్ష్మి కాలనీ, గాయత్రి కాలనీ, జమ్ము బాడవ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మంచినీటిలో డ్రెయినేజీ వాటర్ కలిసిపోతుందని, దీనిపై కనకాలపేట వాటర్ హౌస్ ఇన్‌ఛార్జ్‌ను సంప్రదించగా రెండు చోట్ల మరమ్మతులు చేశామని, ఎక్కడ మురికి నీరు కలుస్తుందో తెలియడం లేదని చెబుతున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన ప్రజా పనుల శాఖ జూనియర్ ఇంజనీర్ బొడ్డు ప్రసాద్‌ను సంప్రదించాలని ప్రయత్నించిన, ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్త లేదన్నారు. సంబంధిత అధికారులను పిలిచి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆయన కోరారు.

కంపోస్టు యార్డుగా శ్మశాన వాటిక

-ఇబ్బందులు పడుతున్న ప్రజలు
-పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో పలు సామాజిక వర్గాలకు చెందిన శ్మశాన వాటిక కంపోస్ట్ యార్డ్ మాదిరిగా తయారైంది. ఎవరైనా మృతిచెందితే వారి దేహాలకు అంత్య క్రియలు జరిపించేందుకు చెత్త పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మృతుల చివరి మజిలీ సమయంలో సుఖం ఉండడం లేదని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతులను ఖననం చేసేందుకు, దహనం చేసేందుకు వెళ్లాలంటే మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను శ్మశాన వాటికను అనుకుని డంపింగ్ చేయడంతో పాటు ముళ్ళపదలు విపరీతంగా అల్లుకొని ఉండటంతో స్మశాన వాటికకు వెళ్లే వీలు లభించడం లేదని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. పట్టణ పరిధిలో కోట్లమ్మ చెరువు ప్రాంతానికి చెందిన దళిత పేట, పెన్షన్ లైను ప్రాంతానికి చెందిన రెల్లి సామాజిక వర్గం, పట్టణ పరిధిలో ఉన్న సామాజిక వర్గాలకు సంబంధించి పట్టణంలోని పిఠాపురం రోడ్డులో ఉన్న పశువులమ్మ తల్లి ఆలయం ఆనుకుని స్మశాన వాటిక పూర్వం నుంచి కొనసాగుతుంది. అయితే దానిని అధికారులు పూర్తిగా విస్మరించడంతో దాదాపు స్మశాన వాటిక వినియోగానికి పనికి రాకుండా మారింది. స్మశాన వాటికంత ముళ్ళపొదలతో నిండుకుని ఉండడంతో ఎవరైనా మృతులకు అంత్యక్రియలు జరిపించాలంటే ముళ్ళ పొదలను తప్పించుకుని వెళ్లడానికి ప్రజలు నాన యాతన పడుతున్నారు. అది చాలదంటూ

శ్మశాన వాటికకు వెళ్లే దారిలో చెత్తాచెదారంతో ఉన్న రహదారి

ప్రస్తుతం పట్టణంలో సేకరించిన చెత్తను శ్మశాన వాటిక రహదారి చెంతను డంపింగ్ చేసి పూర్తిగా నింపడంతో స్మశాన వాటికకు వెళ్లేందుకు మార్గం సైతం మూసుకుపోయింది. ఈ పరిస్థితిపై పట్టణ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఏలూరు కాలువ డ్రెయిన్ ఉండి వర్షాకాలంలో స్మశాన వాటికను ముంచెత్తు తుండటంతో స్మశాన వాటికకు రక్షణ లేకుండా పోతుందని ప్రజల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి నుంచి గట్టేక్కాలంటే ఏలేరు కాలువ డ్రెయిన్ ఆనుకుని శ్మశాన వాటికకు రక్షణ గోడను నిర్మించాల్సి ఉంది. అలాగే ఎప్పటికే స్మశాన వాటిక స్థలాలు చాలావరకు ఆక్రమణలకు గురైందని, ఉన్న స్థలాన్ని కాపాడుకునేందుకు స్మశాన వాటిక చుట్టూ రక్షణ కంచె గాని, ప్రహరీ నిర్మాణం గానీ నిర్మించి భద్రత కల్పించాలని ఆయా సామాజిక వర్గాల నాయకులు కోరుతున్నారు. ప్రస్తుతం స్మశాన వాటికను ఆనుకుని డంపింగ్ చేసిన చెత్తను తొలగించి దుర్గంధం నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కోరంగి అభయారణ్యంలో సందడి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సంక్రాంతి సందడి ముగియగానే కోరంగి అభయారణ్యంలో పర్యాటకుల సందడి ప్రారంభమైంది. సంక్రాంతి సందర్భంగా ప్రభుత్వం విద్యా సంస్థలకు సెలవులు మంజూరు చేయ డంతో విద్యార్థులు తల్లి దండ్రులతో కలిసి అభయారణ్యంలో పర్యటిస్తున్నారు. దీంతో ఇక్కడ సందడి వాతావరణం నెలకుంది. ప్రకృతిని ఆస్వాదించడానికి వచ్చే పర్యాటకులతో పాటు, పండుగ సందర్భంగా బంధువుల ఇంటికి వచ్చిన పలువురు పర్యాటక కేంద్రాన్ని సందర్శించడంతో చొల్లంగి పర్యాటక కేంద్రం తిరునాళ్లలా మారింది. అభయారణ్యం సందర్శనకు వచ్చే పర్యాటకుల వాహనాల కోసం అటవీ శాఖ ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయం కల్పించింది. చొల్లంగి పర్యాటక కేంద్రం వద్ద ఐలవ్ కోరంగి అని ఏర్పాటుచేసిన సింబల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సింబల్ వద్ద పలువురు సెల్ఫీలు దిగడానికి పోటీలు పడుతున్నారు.

పర్యాటకులతో కిటకిటలాడుతున్న పార్కు

వెదురుమూడి మలుపు వద్ద రహదారిపై గోతుల్లో చేరిన మురుగునీరు

ప్రమాదకరంగా రహదారి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల పరిధి వెదురుమూడి నుంచి జొన్నాడ వెళ్లాలంటే ఆర్అండ్‌బి రహదారి గోతులతో ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి పై ప్రయాణాలు చేయాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతితో పెట్టుకోవలసిన పరిస్థితి. ప్రతీ రోజు రద్దీగా ఉండే ఈ రహదారి మీదుగా పాఠశాలకు వెళ్లే వాహనాలు, ద్విచక్ర వాహనదారులు వెళ్లాల ంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు రహదారిలో మలుపు ఉండడం ఆ మలుపు సమీపంలో పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని ప్రజలు స్థానికలు వాపోతున్నారు . ఈ రహదారి మీదుగా విద్యార్థులు సైకిల్‌పై పాఠశాలకు వెళ్లాలంటే పెద్ద గోతులు ఏర్పడడంతో ఆ గోతుల్లో జారి పడే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అలాగే వాహనదారులు ఈ రహదారిపై ఉన్న గోతుల్లో రాకపోకలు సాగించాలంటే అవస్థలు పడుతున్నారు. కొత్తూరు, జొన్నాడ, రావులపాలెం, మండపేట తదితర గ్రామాలకు వెళ్లాలంటే ప్రతి నిత్యం ఈ రహదారి మీదుగా ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఎంతో రద్దీగా ఉంటున్న రహదారిపై ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులకు ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు గోతులు ఉన్న ప్రదేశాల్లో మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, వాహనదారులు ప్రయాణికులు, వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని పామర్రు హైస్కూల్లో 2003-2004 విద్యా సంవత్సరంలో టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక గురువారం ఉత్సాహంగా.. ఉల్లాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వీరంతా తమ చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులంతా ఆటపాటల సందడి చేశారు. అనంతరం వారి విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు నండూరు భీమరాజు, సివివి. సత్యనారాయణ, రామకష్ణ తదితరులను ఘనంగా సన్మానించారు.
రౌతులపూడి: స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాల 2006-07కు చెందిన 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు రామకృష్ణాపురంలో కలుసుకున్నారు. ఒకరికొకరు కలుసుకొని వారి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న పామర్రు హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ఘనంగా అమ్మవార్ల జాతరలు

ప్రజాశక్తి - యంత్రాంగం

సంక్రాంతి సందర్భంగా గురువారం జిల్లాలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతల జాతరలను యాత్రికులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామాల్లో అమ్మవార్ల ఊరేగింపులు నిర్వహించారు.
రామచంద్రపురం : సంక్రాంతి పండుగ సందర్భంగా కె.గంగవరం, రామచంద్రపురం మండలంలోని పలు గ్రామాల్లో గురువారం చివరి రోజు గ్రామ దేవతల జాతర నిర్వహించారు. కె.గంగవరం మండలం ఎర్రపోతవరంలో గొల్లలమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, తీన్మార్లు, బుట్ట బొమ్మల వేషాలతో జాతర కొనసాగింది. అదేవిధంగా శివాల గ్రామంలో గల పాపమ్మ అమ్మవారు తీర్థం ఘనంగా నిర్వహించారు. ఇక రామచంద్రపురం మండలంలోని వేగాయమ్మ పేటలో గల ఎల్లారమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. యాత్రికులు పెద్ద ఎత్తున ఎల్లారమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో ప్రజలు కార్యక్రమాలకు హాజరయ్యారు. **ఆలమూరు:** మండలంలోని పెదపళ్ళలో పోలేరమ్మ అమ్మవారి తీర్థ మహెూత్సవం గురువారం కోలాహలంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంక్రాంతికి మండలంలో ప్రభ తీర్థం జరిగే ఒకే ఒక్క తీర్థంగా పెదపళ్ళ పోలేరమ్మ తీర్థం ప్రసిద్ధి చెందింది. ఈ సందర్భంగా నూతన జాతర కమిటీ ఆధ్వర్యంలో శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి వారి ప్రభను కేరళ చండే డప్పు వాయిద్యాల మధ్య కోలాహలంగా గ్రామోత్సవం నిర్వహించి పోలేరమ్మ తీర్థ మహోత్సవం జరిగే చోటుకు తీసుకుని వచ్చారు. యాత్రికులు పోలేరమ్మకు, గని పోతురాజుకు, శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి వారి ప్రభకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళ చండే వాయిద్యకారుల లయబద్ధమైన సంగీత, నత్యాలు యాత్రికులను విశేషంగా ఆకర్షించాయి.
ఆత్రేయపురం: మండలంలోని ఉచ్చిలి గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత మారెమ్మ అమ్మవారి బుధవారం రాత్రి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ కళాకారులతో గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బుట్ట బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతర మహోత్సవం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెలించారు. అలాగే ఆత్రేయపురం గ్రామ దేవత మహాలక్ష్మి అమ్మవారి జాతర గురువారం రాత్రి మిరుమిట్లు గొలుపే బాణా సంచల నడుమ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది.

In the Court of the Ist Additional Senior Civil Judge at Kakinada
E.P. No. 54/2020 in **O.S. No. 641/2014**

Between:
Reddypalli Narayana Rao ...*DHr/ Plaintiff*
AND
Chinthapalli Vijaya Lakshmi ...*JDr/ Defendant*

To:
Chinthapalli Vijaya Lakshmi, W/o. Nagendu Srinivas, Teacher, R/o. Door No. 4-103, Rajula Toorangi, Kakinada Rural Mandalam, Kakinada District.

పై నెంబరు అమలు గ్రంధములో JDr అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 23-01-2025వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై అమలు గ్రంధము మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వింజమూరి వెంకటరావు, అడ్వకేట్
కాకినాడ, సెల్: 98665 50610

ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
Debtors I.P.No.05/2022

Between :
అడబాల గంగాభవాని, W/o. లేటు వేణుగోపాలరావు, శ్రీరామ్‌పేట, పాలకొల్లు, ప.గో.జిల్లా. ...పిటీషనర్
Vs
మహిపాల పట్టాభిరామారావు & 23 Others ...రెస్పాండెంట్స్

To,
Respondent -19 :
పూడి రాకేశ్ కుమార్, S/o.రాజు, SKS మెగా టౌన్ షిప్, రోడ్ నెం.1, P-2, House No.8, గంగపల్లి, కాకినాడ మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు కేసులో పిటీషనర్ బాకీలు చెల్లించలేని స్థితిలో పైకోర్టులో పిటీషనర్‌ని దివాలా కోరుదారుగా (Insolvents) ప్రకటించమని పిటీషన్ వేసినందున కోర్టు వారు **ది.20-01-2025** సం.రం. తేదీనకు వాయిదా వేసియున్నారు. పై పిటీషన్‌లో మీరు 19వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మీకు అనేక పర్యాయాలు నోటీసు పంపించినప్పటికి మీరు ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకోకపోవడం వలన ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు తెలియ జేయడమైనది. కావున మీకు పై నెంబరు పిటీషనులో అభ్యంతరములు ఉన్న యెడల ది.20.01.2025 సం.రం తేదీన ఉదయం 10.30 ని.లకు స్వయంగా గాని, మీ ప్లీడర్ గారి ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియ జేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.

(By Order)
వలవల సత్యనారాయణమూర్తి, M.A., B.Ed.,L.L.B.
న్యాయవాది, పాలకొల్లు
తేది.16-01-2025 సెల్ : 9849038805

దావా సమన్లు
మహారాజశ్రీ రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 65 / 2024

Between:
కర్రి గోపాలకృష్ణారెడ్డి ...వాది
మరియు
కమిడి రామకృష్ణ, S/o. చిన్న సత్తియ్య, వయస్సు 44 సం॥లు, హిందూ, సెకండరీ గ్రేడ్ టీచర్, M.P.P. స్కూల్, నాగపట్నం గ్రామం, కాట్రేనికోన మండలం, డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం JCJC ...ప్రతివాది

పై నెంబరు దావాలో శ్రీ కోర్టువారు మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ హాజరు నిమిత్తం **21-01-2025** తేదీన పై కోర్టు నందు ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు ఏమైనా ఉన్నయెడల శ్రీ కోర్టువారికి తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)
కె.లోవరాజు
జి.మల్లేశ్వరరావు
అడ్వకేట్స్, రామచంద్రాపురం
రామచంద్రపురం
ది.16-01-25

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
(*మైనర్ అయిన* ***Mirza Muhammad Aahil Abbas,*** *age 7 కొరకు*)
G.O.P. 108/2024

Between:
Mirza Shakeel Abbas, S/o. Moulaali, Muslim, age 39, R/o. D.No. 9-47, Main Road, Konthamuru, Rajamahendravaram Rural, E.G.Dist., ...*Petitioner*
AND
Nil ...*Respondents*

పై నెంబరు గార్డియన్ గ్రంధమును, మైనర్ అయిన Mirza Muhammad Aahil Abbas యొక్క అభివృద్ధి మరియు చదువు, పోషణ కొరకు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని విక్రయించుటకు అనుమతులు కోరుచూ పిటీషనరు దాఖలు చేసియున్నారు. పై గ్రంధంలో ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల **ది. 30-1-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపవలసిందిగా యావన్మందికి తెలియజేయడమైనది.

ఆస్తి వివరములు

East Godavari District, Rajamahendravaram District Registrar area, Pidimgoyyi Sub Registrar Office, Rajamahendravaram Rural Mandal, Kolamuru Grama Panchayathi, Kolamuru Village, zeroity dry land in R.S.No.748/2, land devided into house plots, in layout plan in plot No.12 in an extent of 358 Sq.Yds in northern side some extent of site acquired for second approach road bridge margin, southern side remaining site in an extent of 212 Sq.yds in Eastern side in an exten. of 106 Sq.Yds of site, as per the endorsement of Tahsildar office, Rajamahendravaram Rural L.per.B/5/2020, dated 02-09-2020 present R.S.No.748/2c in an extent of 106 Sq.Yds (88-62 Sq. Mtrs) vacant site bounded by:
East: 26-7 Feets, 30 feet width Road, **South:** 36 Feets, Plot No.13 site, **West:** 26.7 Feets, Seera Johnsi Lakshmi Rani Share of site in this plot number, **North:** 35-9 Feets. Service Road of Second approach Road Bridge
With all easementary rights, water sources etc.,

పాలెపు అప్పారావు
కె.విష్ణుప్రియ
అడ్వకేట్స్, రాజమండ్రి
రాజమండ్రి
ది.16-1-25

MUNICIPAL CORPORATION, RAJAMAHENDRAVARAM
REQUEST FOR PROPOSAL
RFP/ Tender No. 210/RFP/RMC/ 2024-25 **Dated: 10-01-2025**

Requested for proposal is invited for "DESIGN, DEVELOPMENT AND BEAUTIFICATION OF VARIOUS PARKS & OPEN SPACES IN RAJAMAHENDRAVARAM CITY (PACKAGE-1)".

RFP can be down loaded from e-procurement web site www.apeprocurement.gov.in in Service Sector from 10-01-2025 at 9.00 P.M on wards. 2. Last date of time of receipt of RFP on or before dt. 27-01-2025 upto 3.00 PM.

Sd/- **KETAN GARG,** I.A.S.,
COMMISSIONER
Municipal Corporation, Rajamahendravaram

यूनियन बैंक ऑफ इंडिया
भारत सरकार का उपक्रम
Union Bank of India
A Government of India Undertaking

REGIONAL OFFICE : RAJAHMUNDRY
Ph: URSETI 0883-2428807, 2420242
Email: abirdrjy@gmail.com

Applications are invited for the post of FACULTY (one vacancy) for Union Rural Self Employment Training Institute (URSETI), Rajahmundry on contractual basis.

Eligibility Criteria for Faculty :
a. Graduate from a recognized University or equivalent
b. Age 22 to 40 years at entry level
c. Should know MS Office and internet
d. Should know Telugu language and English
e. Should belong to erstwhile East Godavari District

The appointment shall be on contractual basis for a period of 11 months and extendable.
Remuneration: Rs. 30,000 Plus (fixed Conveyance allowance) Rs. 2500/-
Last date for receipt of application is 15 days from the date of this notification.
For application format and other details contact DIRECTOR, UNIONRSETI, D.No. 2-40-57, Alcot Gardens, ILTD Junction, Opp: Ratna Plastics, Rajahmundry-533101.
Date: 17-01-2025
Place: Rajahmundry Sd/- **Regional Head,** Rajahmundry